# ఒక రోజు

రచన:
శ్రీ ఎస్. ముద్దుకృష్ణ.

కాలప్రవాహంలో ఎన్నో యేళ్ళు. ఆ యేళ్ళలో నా జీవితం కొన్నాళ్ళు. ఆ కాలప్రవాహంలో, నా జీవితం కొన్నాళ్ల ఓ రోజు.

ఆ రోజు సాయంత్రం ఏమీ తోచటం లేదు. మనస్సులో ఏదో చిరాకు. అర్థంకాని ఆరాటం. స్నేహితులెవ్వరూ కలవకపోవటం, పనేమిలేకపోవటం, అలా వుండటానికి కారణం కావచ్చు. షికారు బయలుదేరాను. సాయంత్రం చల్లగా వుంది. కాని, మనస్సు మౌనం వహించింది ఎందుకనో. అలా రైల్వేస్టేషన్‌లోకి వెళ్ళాను. ఏదో రైలు వచ్చింది అప్పుడే. ఎక్కేవాళ్ళు, దిగేవాళ్ళు చేసే దెబ్బలాటలు, అమ్ముకొనేవాళ్ళ హడావిడి, అంతా గందరగోళంలా వుంది. అదంతా చూస్తుంటే నాకు తలనొప్పి వచ్చేలా వుంది. బయటకు నడిచాను. రోడ్డుమీద నెమ్మదిగా నడుస్తున్నాను.

ఎవరో జంట ప్రక్కనున్న పార్కులోంచి, నవ్వుకొంటూ బయటికొస్తున్నారు. వాళ్ళను చూసి నాముందు వెళ్తున్న అబ్బాయిలలో ఒకడు, 'కొత్తగా పెళ్ళిచేసుకొన్నారేమో. చాల హుషారుగా వున్నారు,' అన్నాడు. వాళ్ళగూర్చి తను కామెంట్ పాస్ చెయ్యాల్సిన అవసరం వున్నట్లు. 'కాదు', అన్నాడు ఆ జట్టులోనే యింకొకడు. 'కాకపోతే అన్నా చెల్లెళ్ళయి వుంటారు. అన్నాచెల్లెళ్ళు అంత చనువుగా వున్నారంటే హర్షింప దగ్గదే', అన్నాడు మొదటివాడు తనకి ఊహించటం సరిగ్గా చేతనవునన్నట్లు 'కాదు' అన్నాడు రెండవవాడు వెంకిగా. 'అయితే ప్రేమికులన్నమాట' అని నవ్వాడు. మౌనంతో అంగీకారం సూచించాడు, అప్పటిదాకా కాదన్నవాడు. 'ఇంకేం, మన యిండియా ఫార్వర్డ్‌కు (ముందుకు) వచ్చేస్తుందన్నమాటే. ఫారిన్ కంట్రీన్ లోలా మనదేశంలోకూడా పెళ్ళికాకుండా ప్రేమికులు షికారు బయలుదేరారంటే చెప్పుకోదగ్గదే. కొంతకాలంపోతే ఫారిన్ కంట్రీస్‌ని మించేస్తుంది, అన్నాడు అదో మాదిరిగా నవ్వుతూ.

'అవును; ఇలాంటివాళ్ళుంటే మన భారతదేశం పురోగమించదూ? ఇదే, ఫారిన్ కంట్రీస్‌లోనైతే ఆడా మగ జంటలుగా తిరిగితే ఏమన్నా అనుకొంటారా? వాళ్ళ సంబంధం ఏమై వుంటుందని ఆలోచిస్తారా? వాళ్ళు అయితే భార్యాభర్తలన్నా కావాలి; లేదా అన్నా చెల్లెళ్ళన్నా కావాలి, కాకపోతే ప్రేమికులన్నా కావాలి. అంతేగాని కల్మషరహితమైన, స్వచ్ఛమైన స్నేహితులు కాకూడదా? ఇతర దేశాలతో పోల్చుకోవల్సింది ప్రేమికులెంతమంది అన్న విషయంలోనా? ఇదేనా పురోగమనానికి అర్థం'? ఉద్రేకం అడగమని ప్రోత్సహించింది ఆ క్షణంలో, వాళ్ళ బలహీనత చూసి నవ్వుకోగలిగిన నన్ను. అయినా నాకెందుకు లెమ్మని ఆ ఆవేశాన్ని అణుచుకున్నాను. తొందరగా అడుగులు వేసాను.

రోడ్డు మీద నడుస్తుంటే ఏదో గోల నా దృష్టిని పడి నా చిరాకు నెక్కువ చేస్తుంది. అందుకని నడిచి, నడిచి రైలు పట్టాల దగ్గరికి చేరుకొన్నాను. రైలు పట్టాల ప్రక్కనే కాలిబాట. ఆ బాటలో తనివితీరా నడిచి కొంతదూరం చేరుకొన్నాక, బాటకు కొద్దిగా ప్రక్కకు పోయి కూర్చున్నాను.

అస్తమించే సూర్యుడు తన అంతిమ కిరణాలను వెదజల్లుతున్నాడు. అరుణరాగ రంజితమై వుంది ఆకాశంలో ఒక భాగం. మరొక భాగం అంధకారం నింపుకొంటున్నది అప్పుడే. మానవులకు వెలుగు శాశ్వతం కాదు. వెలుగు నుంచే చీకటి పుడుతుంది. చీకటి లోంచే వెలుగు జనిస్తుంది. చీకటి వెలుగులను సమానంగా చూడటం నేర్చుకోమని ప్రకృతి పాఠం చెబుతున్నది, మాట వినని మానవులకు.

అప్పుడే చాలవరకు చీకట్లావరించాయి. జాగ్రత్తగా చూస్తే పడమటి దిక్కున ఏదో కొద్దిగా మంట వేస్తున్నట్లు ఎరుపుదనం కనిపిస్తున్నది. ఊళ్ళో లైట్లు వెలిగాయి. చీకటిలో దీపాలు - కఠినాత్ముని హృదయంలో కరుణా రసపు బొట్లలా, అదీ నా భావనలో మెరిసిన ఓ చిన్న ఆలోచన. స్ట్రీట్ లైట్ వెలిగినంత వేగంగా స్వార్థ మానవ హృదయంలో కరుణ జనిస్తుందా? మానవుల మంచితనంపై అపనమ్మకం

మానవుడినైన నాకు. కానీ, ఏమిటీ భావాలు? వీటివల్ల ప్రయోజనమేమిటి? అసలు జీవితంవల్ల ప్రయోజనమేమిటి? అర్ధంకాని ప్రశ్న. సమాధానంలేని ప్రశ్న. ఒక వేళ్ళున్నా సమస్యగానే వున్న ప్రశ్న. నాబోటి అజ్ఞానికి అవసరమా యీ ప్రశ్న? అన్నీ ప్రశ్నలే. జీవితమే ఓ ప్రశ్న! జీవితం ముగిసిన తరువాతనే జీవితపు ప్రశ్నకు సమాధానం.

అక్కడ నేనొంటరిని. ప్రక్కనున్న కాలిబాట మీద కూడా అరగంటకు ఒకరో యిద్దరో తప్ప ఎక్కువ మంది నడవటంలేదు. నేను నా ఆలోచనలు. చుట్టూ నిశ్శబ్దం. నిశ్శబ్దంతో యేవో అప్పుడప్పుడు సన్నని శబ్దాలు, వీస్తున్న గాలివల్ల ఎదురుగుండా వున్న ఈత చెట్టుకి మట్ట రాసుకొంటున్నది. వెన్నెల వెదజల్లుతున్నాడు ఆకాశంలో అందాల చందమామ, మెరిసే తారల మధ్య. ఎదురుగా వాన నీళ్ళతో నిండిన గుంట-నిశ్చలంగా వుంది - అందులో ఆకాశపు అందం అంతా ప్రతిఫలిస్తోంది. ఎందుకో రాయి విసర బుద్ధయింది. మానవులలో వుండే సాధారణ బలహీనత. నీళ్ళు కదిలిపోయాయి, అందులో వున్న నీడల్తో చల్లగాలి పలుకరించింది, పులకరించింది నావళ్ళు. ఏదో భావం... ఊహలతో ఉద్భవించిన భావం...ఏదో ఆనందం...అవధులు లేని ఆనందం...ఆవేశం...కవితావేశం.

'మదిలో మెదిలే మధురానుభూతులు
మల్లెల మాలలై మురిపింప జేసె
తీయని తలపులై తపియింప జేసె
కలలన్ని కోర్కెలై కవ్వింప జేసె'—

అని పాడుకోవాలనిపించింది. గొంతులోంచి బయటకు రాక గుండెల్లోనే వొదిగిపోయింది.

కాలి బాటమీద ఎవరో భారంగా నడుస్తున్న అడుగుల చప్పుడు. అకస్మాత్తుగా నా దృష్టి ఆకర్షింపబడింది. జాగ్రత్తగా పరిశీలించాను. ఎందుకో ఎవరో ఒక వ్యక్తి చినిగిపోయిన బట్టలతో, మాసిపోయిన గడ్డంతో, రేగిపోయిన జుట్టుతో, మూటకట్టిన గోనె సంచి వీపుమీద వుండటం వల్లనో లేక జీవితం అతని మీద పెట్టిన బరువువల్లనో ముందుకువంగి నెమ్మదిగా, బరువుగా నడుస్తున్నాడు. రైలుపట్టాల ప్రక్కనుంచి అతని జీవితమేమిటని అడగాలనుకున్నాను. కాని అడగలేకపోయాను అడిగితే మానవ జీవితంలో కష్టాలన్నీ కథగా కూర్చి చెప్తాడేమో ననిపించింది. పుట్టడం ధనవంతుల యింట్లోనే పుట్టాడేమో, చదువు సంధ్యలున్న సంస్కారేమో. ఉద్యోగం లేక వెతలపాలయ్యాడేమో, ఆప్తులుగా నటించి అతని ఆస్థి దోచుకున్నారేమో వంచకులు అసలిదేమీ కాకపోవచ్చు. ఎవరో అనాదలకు చెట్టుక్రింద పుట్టివుండవచ్చు. అనాధ శరణాలయంలో చేరని వేలాది అనాధలలా జీవించి వుండవచ్చు. అడుక్కుతిని, చెట్టు క్రింద పడుకొని నెట్టుకొస్తుండవచ్చు. కాకపోను వచ్చు. ఏది ఏమైనా అతను విధిచేత వంచింపబడ్డాడు. అతనికిప్పుడు సుఖాలుదుఃఖాలు సమానమైపోయి వుంటాయి. అతనికిప్పుడు క్రొత్తగా సుఖంవచ్చినా సంతోషపడడు. అతనికింకా క్రొత్తగా దుఃఖం వచ్చినా విచారపడడు. బహుశా జీవితానికి శాంతి, హృదయానికి ప్రశాంతి కోరి ఆలమటిస్తుంటాడు. అది అన్వేషణకు ఆరంబం, కాని ఆ అన్వేషణకు అంతం ఎక్కడ? ఏమో? ఇది నాభావనలో నిలిచిన ఆలోచన.

దూర తీరాలకు సాగి పోయే
బాటసారీ! సాగిపో! సాగిపో!

లేదు నీకు సుఖం
లేదు నీకు దుఃఖం
కనలేని శాంతి,
కనుగొనాలని
కోరె ప్రశాంతిని
కోరి అన్వేషించు
అన్వేషణయే నీ
అంతిమ విజయం

అన్వేషణలోనే
అంతరిస్తే? అదే
ఆనందమా? అదే
అసలు ధ్యేయమా?

దూర తీరాలకు సాగిపోయే
బాటసారీ! సాగిపో! సాగిపో!

విరాగిలా సాగిపోతున్న అతనికి నా గుండెలు ఆలపించిన యీ గానం వినిపించాలని నోరు తెరిచాను. కాని మాట్లాడలేని అశక్తత. గొణుక్కున్నట్లు నా మాటలు. అతను వెళ్ళిపోయాడు. నేను నా ఆలోచనలు మిగిలిపోయాం.